بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 04.10.2019 (Telugu)**

## జల్స సాలానా (వార్షిక సభ) ఉద్దేశ్యమలను తెలుపుతు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లన్నారు. పరలోక ఆలోచన కలుగవలెను, దైవ భీతి ఏర్పడవలెను, నిష్ఠాపరత కలుగవలెను, నిర్మల హృదయము ఏర్పడవలెను, పరస్సరం ప్రేమానురాగ, సోదరభావమైన వాతావరణము ఏర్పడవలెను, నిరాడంబరత, వినయము కలుగవలెను, సత్యమును పాటించవలెను, ధార్మిక సేవకు సన్నద్ధం కావలెను, ఈ విషయములు ఇక ముందు మా జీవిత భాగములుగా మారునని ప్రతిజ్ఞ చేస్తూ ఈ మూడు రోజులను గడపవలెను

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 04.10.2019 తేదీన - సభా ప్రాంగణము హాలేండ్, నన్స్‌పీట్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లన్నారు. నేడు అల్లాహ్ తఆలా కృపానుసారము మీ వార్షిక సభ ప్రారంభమగుతున్నది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం జల్సను ఒక ప్రత్యేక ధార్మిక సమావేశమని పేర్కొనిరి. ధార్మిక, ఆధ్యాత్మిక ప్రగతి కొరకు మనమిక్కడ సమావేశమైనామని ఇందులో పాల్గొను ప్రతి వ్యక్తికి స్పష్టము కావలెను. మన ధార్మిక, ఆధ్యాత్మిక స్థితిని ఎలా మెరుగు పరచుకోవలననే ఆలోచనతో ఈ మూడు రోజులను మనము గడపవలెను. ఇలాంటి ఆలోచన లేనిచో ఇక్కడికి రావడం నిరర్థకమగును. నేటి ఈ ఆధునిక కాలములో ప్రపంచము అల్లాహ్ తఆలాను మరచి పోతున్నది. ప్రతి ధర్మమును విశ్వసించువాడు తన ధర్మము నుండి దూరమవుతున్నాడు. తుదకు ముస్లిములు కూడ ప్రాపంచికమునకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ తరుణంలో మనము కూడ తమ పరిస్థితులను మెరుగు పరచుకోనిచో మనము మసీహ్ మౌవూద్ బైఅత్ చేయుట ఆధ్యాత్మిక స్ఫూర్తి లేనటువంటి ఒక బాహ్య ప్రకటన మాత్రమే అగును. మన బైఅత్ ప్రతిజ్ఞను మనము పూర్తి చేయనిచో అది నామమాత్రముగా మిగిలి పోవును. అలాంటప్పుడు మనము ఇక్కడ జల్సలో పాల్గొనుట ఒక ప్రాపంచిక జాతరలో పాల్గొన్నట్లగును. కావున ప్రతి అహ్మదీ ఎంతో ఆలోచించవలసిన సమయమిది.

మనము బైఅత్ ప్రతిజ్ఞను పూర్తి చేయదలచినచో, మన సంతానమును రక్షించుకోదలచినచో జల్స నిర్ణీత ఉద్దేశ్యములను గమనించవలెను. ఈ విషయములు ఇక ముందు మన జీవిత భాగములుగా మారుననే ప్రతిజ్ఞతో ఈ మూడు రోజులను గడపవలెను. జల్స సాలానా (వార్షిక సభ) ఉద్దేశ్యములను తెలుపుతు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లన్నారు. పరలోక ఆలోచన కలుగవలెను, దైవ భీతి ఏర్పడవలెను, నిష్ఠాపరత కలుగవలెను, నిర్మల హృదయము ఏర్పడవలెను, పరస్పరం ప్రేమానురాగ, సోదరభావమైన వాతావరణము ఏర్పడవలెను, నిరాడంబరత, వినయము కలుగవలెను, సత్యమును పాటించవలెను, ధార్మిక సేవకు సన్నద్ధం కావలెను.

ఈ ఉద్ధేశ్యముతో నేడు మనమిక్కడ గుమికూడితిమి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆదేశము ప్రకారము ప్రాపంచిక విషయములు అతని దృష్టిలో ఎలాంటి ప్రాధాన్యత లేని విధంగా పరలోక వ్యాకులత వారిని నమ్మే ప్రతి పురుషుడు, స్త్రీ, యువకుడు, వృద్ధునిలో కలుగవలెను. ఈ వస్తు ప్రపంచములో నివసిస్తున్న వారికి ఇది చాలా పెద్ద పని, ఒక గొప్ప సవాలు. దీనిని పూర్తి చేయుటకు చాలా కృషి చేయవలసిన అవసరమున్నది. అల్లాహ్ తఆలా ఉనికిపై పూర్తి నమ్మకమున్నప్పుడే, ఈ జీవితము కొన్ని సంవత్సరములకు పరిమితమైనదని విశ్వాసమున్నప్పుడే పరలోక చింతన కలుగును. తాత్కాలిక వస్తువును శాశ్వత వస్తువు కొరకు త్యాగము చేసినవాడే తెలివిమంతుడు. కాని జరుగుతున్నదేమనగా మనము ఈ తాత్కాలిక వస్తువు, తాత్కాలిక జీవితము కొరకు శాశ్వత జీవితమును త్యాగము చేస్తున్నాము. ఇలా చేసి ఈ ప్రాపంచికులు తమను తాము గొప్ప మేధావులుగా భావిస్తున్నారు. కాని ఒక విశ్వాసి ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తాడు, వ్యవహరించవలెను. అప్పుడే అతడొక విశ్వాసి అనబడును. అతడు తన

హృదయములో దైవభీతి కలిగి వుండును. అల్లాహ్ తఆలా పట్ల అతని మనసులో భయముండును. అల్లాహ్ తఆలా ప్రేమ ప్రాపంచిక ప్రేమలన్నిటిని జయించును. శిక్ష లభించునని అల్లాహ్ తఆలా భయము, భీతి కలుగ కూడదు. నా ప్రియమైన దేవుడు అసంతృప్తికి గురగుననే భావన కలుగును. ఇటువంటి ప్రేమపూర్వక భావాలున్నప్పుడే మానవుడు అల్లాహ్ తఆలా ఆదేశములను పాటించుటకు ప్రయత్నించును.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మనలో కల్పించిదలచిన ఈ విషయముల పట్ల ఆసక్తి అవసరమున్నది. బాహ్య పొట్టు కాక స్ఫూర్తి, లోపలి పప్పు అవసరముండును. ఈ విషయములను దృష్టియందుంచుకొని మనము ఇదే ఉద్దేశ్యముతో ఈ జల్సలో పాల్గొంటున్నామా? ఈ లక్ష్యములను పొందుటకు మనలో చింత వున్నదా? అని మనము ఆత్మ పరిశీలన చేసుకోవలసిన అవసరమున్నది. మానవ లోపముల వలన ఈ విషయములను పొందుటకు ఇంతకు ముందు మనతో తప్పిదాలు, లోపాలు జరిగినచో ఇక ముందు మనము ఒక క్రొత్త సంకల్పముతో ఈ సత్కార్యములను కల్పించుకొనుటకు, వాటిని కొనసాగించుటకు సాధ్యమైనంత వరకు ప్రయత్నించవలసిన అవసరమున్నది. ప్రపంచము కంటే ఎక్కువ పరలోకము గురించి చింతిస్తామని, మేము అల్లాహ్ భీతి, అతని భయము, అతని ప్రేమకు ప్రతి విషయముపై ప్రాధాన్యతనిత్తుమని, నిష్ఠాపరత సూక్ష్మ మార్గములలో పయనించుటకు ప్రయత్నింతుమని, మేము పరస్పరం తమ మనసులలో నిర్మలత్వము కలిగించుకొంటామని, ప్రేమ, సోదరభావము ఆదర్శంగా నిలిచే విధంగా మేము పరస్పరం ప్రేమ, సోదరభావము కలిగించుకొంటామని, నిరాడంబర, వినయములో ముందుకెళ్లుతామని, ఈ అహ్మదీయులు సత్యముపై నిలుస్తారు, సత్యమే పలుకుతారు, ఇందుకు పెద్ద పెద్ద నష్టములను కూడ భరిస్తారని, ప్రతి ఒక్కరు అనే విధంగా మేము సత్యము, స్పష్టమైన మాటలను మా ప్రత్యేకతగా మార్చుకుంటామని ప్రతిజ్ఞ చేయవలెను. వీరు అల్లాహ్ తఆలా ధర్మ సందేశమును తమ చుట్టు ప్రక్కలలో వున్న ప్రతి వ్యక్తికి తెలుపుటకు కృషి చేయుదురు. నిజమైన ఇస్లాం ఏమిటో వారికి తెలుపుతారు. మనము మన ఈ ప్రతిజ్ఞను పూర్తి చేయువారైనచో బైఅత్ ప్రతిజ్ఞను మనము పూర్తి చేయువారము కాగలము.

కనుక నేడు ఈ విషయములను పొందుటకు ప్రణాళిక రచించుటకు సంకల్పించండి. పరలోక చింతన, అల్లాహ్ తఆలా భీతి కలిగిన వారు అల్లాహ్ తఆలా నీ జీవిత ఉద్దేశ్యము ఏమని నిర్ణయించాడని మొట్టమొదటగా తమ ప్రార్థనను రక్షించుకొనుటకు శ్రద్ధ చూపవలెను. అల్లాహ్ తఆలా ఇట్లనెను. وَمَا خَلَقْتُ الْجِنَّ وَالْإِنْسَ إِلَّا لِيَعْبُدُوْنِ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఈ సూక్తి అనువాదమిట్లు తెలిపిరి. నన్ను గుర్తించుటకు, నన్ను ఆరాధించుటకు నేను జిన్నాతులను, మానవులను పుట్టించాను. ఈ సూక్తి అనుసారము మానవుని జీవిత అసలు ఉద్దేశ్యము దైవారాధన, అల్లాహ్ తఆలాను గుర్తించుట, అల్లాహ్ తఆలా కొరకు అంకితమగుటయే. ఈ ఉద్దేశ్యమును పూర్తి చేయుటకు అల్లాహ్ తఆలా మనకు ఎలాంటి ప్రార్థన, ఆరాధన పద్ధతులు నేర్పించెను ? అది నమాజ్ సలుపుటయే. అల్లాహ్ తఆలా ఇట్లు సూచించెను. إِنَّ الصَّلٰوةَ كَانَتْ عَلَى الْمُؤْمِنِيْنَ كِتٰبًا مَّوْقُوْتًا అనగా నిశ్చయముగా నమాజ్‌ను నిర్ణీత సమయములో సలుపుట విశ్వాసులపై కర్తవ్యము. حٰفِظُوْا عَلَى الصَّلَوٰتِ وَالصَّلٰوةِ الْوُسْطٰى అనగా అన్ని నమాజులను, ప్రత్యేకంగా పనుల మధ్యలో వచ్చే నమాజ్‌ను సలుపుటకు విధిగా కృషి చేయండి. మనము అల్లాహ్ తఆలా ఈ ఆదేశమును పాటిస్తున్నామా? అని మనలోని ప్రతి ఒక్కరు ఆత్మ పరిశీలన చేసుకోవలసిన అవసరమున్నది. ఇదే విధంగా అల్లాహ్ తఆలా ఇట్లు తెలిపెను. إِنَّمَا يَعْمُرُ مَسٰجِدَ اللّٰهِ مَنْ اٰمَنَ بِاللّٰهِ وَالْيَوْمِ الْاٰخِرِ అనగా అల్లాహ్ తఆలా, ప్రళయ దినముపై నమ్మకమున్న వారే మస్‌జిదులను జనావాసాలుగా మారుస్తారు. మాటవరుసగా మనమందరము విశ్వాలసమని అంటాము. కాని అల్లాహ్ తఆలా గృహమును జనావాసాలుగా మార్చినవారే అల్లాహ్ తఆలా దృష్టిలో విశ్వాసులు. మస్‌జిద్‌నకు రావడము మాత్రమే సరిపోదు. అల్లాహ్ తఆలా, ప్రళయ దినముపై నమ్మకముతో రావలెను. ఇటువంటి ఆలోచన గల వ్యక్తికి అల్లాహ్ తఆలా భయము కూడ వుండును. అతడు మస్‌జిదులకు వచ్చి అశాంతికి పాల్పడడు. నమాజులను వినాశనము కొరకు సులుపు వారిలో అతడు చేరడు. నిష్ఠాపరతను పాటిస్తూ మస్‌జిదులను జనావాసాలుగా మార్చువారు అల్లాహ్ హక్కులు కూడ చెల్లిస్తారు, ప్రజా హక్కులు కూడ చెల్లిస్తారు. ఇటువంటి వారికే శుభవార్తనందిస్తూ ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లన్నారు. ప్రళయ దినమున అల్లాహ్ దేవదూతలను ఇట్లు ఆదేశించును. నా దాసుల నమాజులను లెక్కించుము. నమాజులు పూర్తి అయినచో లెక్క పూర్తి అగును. కాని

విధించబడిన (ఫర్జ్) నమాజులలో తగ్గుదల ఏర్పడినచో వారి అదనపు (నఫిల్) నమాజులను లెక్కించమని ఆదేశించును. అనగా ఫర్జ్ నమాజులలో తగ్గుదల ఏర్పడినచో నఫిల్‌తో పూర్తి చేయబడును.

ఇదొక శుభవార్త అయినట్లే అల్లాహ్ తఆలా శుభములను ఆకర్షించుటకు అదనపు (నఫిల్) నమాజులు సలుపవలెనని మనకు ఇందులో సూచించబడెను. అల్లాహ్ తఆలా భీతిని తమ హృదయములో కలిగించుకొని, అతని శుభములను ఆకర్షించుటకు ఒక వైపు ఫర్జ్‌లను చెల్లిస్తూ మరో వైపు నఫిల్ వైపు కూడ దృష్టి సారించవలెను. స్వచ్ఛమైన రీతిలో వీరే అల్లాహ్ తఆలాకు భయపడు వారు, నిష్ఠాపరతను పాటించువారు. మనలో ఈ విషయములు వున్నాయా అని మన లోని ప్రతి ఒక్కరు ఆత్మ పరిశీలన చేసుకోవలసిన అవసరమున్నది. నిజమైన ఆరాధకుడు అన్ని రకాల పుణ్యములను చేయుటకు ప్రయత్నించును. తమ సోదరుల కొరకు ప్రేమపూర్వక భావములు లేనిచో అతనిలో నిజమైన నిష్ఠాపరత లేదు. నిర్మల హృదయము లేని వారు కూడ తమ గురించి చింతించవలెను. ఎవరి కుటుంబములో అతని భార్యా పిల్లలు ఇబ్బంది పడుచున్నారో అతనిలో కూడ నిష్ఠాపరత లేదు. తమ భర్తల, పిల్లల హక్కులు చెల్లించని, అనవసర విషయములు అడుగు భార్యల హృదయములలో కూడ నిష్ఠాపరత లేనట్లే. కనుక పరస్పర సంబంధములలో అల్లాహ్ తఆలా కొరకు ప్రేమానురాగములతో వ్యవహరించు వారే స్వచ్ఛమైన నిష్ఠాపరత కలిగినవారు. నా వైభవము, నా గొప్పదనము కొరకు పరస్పరం ఆప్యాయతతో వ్యవహరించు వారెక్కడున్నారు! నేడు నా నీడ తప్ప మరో నీడ లేని రోజున నా కరుణామయ నీడలో వారికి స్థానమిత్తునని అల్లాహ్ తఆలా ప్రళయ దినమున ప్రకటించునని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశించారు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ప్రేమించు అందరిని ద్వేషించకు ఎవ్వరిని అని మనము నినదిస్తాము. ప్రపంచములో నిజమైన రీతిలో ఈ సందేశమును అందించుటకు మొదట మనము మన గృహములలో, మన సమాజములో దీనిని వ్యక్తపరచవలసిన అవసరమున్నది. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక సందర్భమున ఇట్లనిరి. ఒక ముస్లిం మరో ముస్లిమునకు సోదరుడు. అతడు అతనిని హింసించడు, అతనిని ఒంటరిగా వదిలిపెట్టడు. ఇంకా ఇట్లనిరి. తన సోదరుని అవసరాలను తీర్చు వ్యక్తి అవసరాలను అల్లాహ్ తఆలా తీర్చును. ఒక ముస్లిం ఆపదను దూరము చేసిన వ్యక్తి ఆపదలలోని ఒక ఆపదను ప్రళయ దినమున అల్లాహ్ తఆలా దూరము చేయును. ఒకరి పాపములను కప్పిపుచ్చిన వ్యక్తి పాపములను అల్లాహ్ తఆలా ప్రళయ దినమున కప్పిపుచ్చును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఈ రోజులలో మన భావాలు పుణ్యము వైపు ఆకర్షితులగుతున్నవి. కావున తమను తాము పరిశీలించుకొంటూ తమ ప్రార్థనల వైపు కూడ దృష్టి సారించండి. నిర్మల హృదయము, నిరాడంబరత వాస్తవికతను గుర్తించుటకు తప్పక ప్రయత్నించండి. ఎందుకనగా మనము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంతో చేసిన బైఅత్ ప్రతిజ్ఞలో అన్యారాధన నుండి దూరముంటామని, ఫర్జ్ నమాజులను సలుపుతూ నవాఫిల్ కూడ సలుపుతామని ఒప్పుకోవడమే గాక సాధారణంగా అల్లాహ్ తఆలా సృష్టి అయిన ప్రజలకు, ముస్లిములకు ప్రత్యేకంగా తమ మానసిక కోరికలకు తలొగ్గి ఎలాంటి నష్టము కలిగించమని కూడ బైఅత్ ప్రతిజ్ఞ చేశాము. దీని ప్రకారము మనము ఆచరిస్తున్నామా. ఈ ప్రమాణములు వున్నప్పుడే మనము నిజమైన విశ్వాసులమని, బైఅత్ హక్కు చెల్లిస్తున్నామని అనగలము.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. గర్వమును పూర్తిగా వీడి నిరాడంబరత, వినయముతో జీవితమును గడుపుతానని బైఅత్‌లో ఒక నిబంధన గలదు. ఈ నిరాడంబరత, వినయమును కల్పించుకొనుట జల్సా ఉద్ధేశ్యములలో ఒక ఉద్ధేశ్యముగా మాత్రమే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం తెలుప లేదు. వారు మనతో తీసుకున్న బైఅత్ ప్రతిజ్ఞలో నిరాడంబరత, వినయముతో జీవితమును గడుపుతానని ఒక నిబంధన గలదు. ఈ ప్రతిజ్ఞనను నిర్వర్తించుట మన బాధ్యత. మనము చేసిన బైఅత్ ప్రతిజ్ఞను పూర్తి చేయుటకు ప్రయత్నించుటయే సత్యము వైపు అడుగు వేయుట అగును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లు ఉపదేశించారు.

ఈ సంఘములో ప్రవేశించి నన్ను ఆధ్యాత్మిక గురువుగా భావించేవారందరు అనగా నా జమాఅత్ మొత్తం ఈ ఉపదేశమును శ్రద్ధగా వినవలెను. వారు సత్యము, సుణ్యము, నిష్ఠాపరత గొప్ప ప్రమాణములను అందుకొనుట, ఎలాంటి పీడనము, అశాంతి, దుష్కర్మలకు దూరముగా వుండుటయే ఈ సంఘం ముఖ్య ఉద్ధేశ్యము. వారు ఐదు

పూటల నమాజ్‌కు కట్టుబడి వుండవలెను. వారు అబద్ధమాడకూడదు, నాలుకతో ఎవరికి బాధ కలిగించకూడదు. వారెలాంటి పాపమునకు పాల్పడకూడదు. వారు దుష్టత్వము, హింస, అశాంతి, కుట్రల ఆలోచన తమ హృదయములో రానివ్వకూడదు. అనగా పాపములు, నేరములు, చేయకూడని, మాట్లాడకూడని, అన్ని తుచ్ఛ కోరికలు, అనవసర పనుల నుండి దూరముండవలెను. పవిత్ర హృదయము, నిస్వార్థ, వినమ్ర, విధేయము గల అల్లాహ్ తఆలా దాసులుగా మారండి. ఎలాంటి విషపూరిత విషయములు వారిలో వుండకూడదు. ప్రజలందరి సానుభూతి వారి నియమము కావలెను. అల్లాహ్ తఆలాతో భయపడవలెను, తమ నాలుకలు, తమ చేతులు, తమ హృదయ కోరికలను అన్ని రకాల అపవిత్ర, పీడనము కలిగించు పద్ధతులు, అవినీతి నుండి దూరముండవలెను. ఐదు పూటల నమాజులను క్రమం తప్పకుండా సలుపవలెను. హింస, దౌర్జన్యము, అవినీతి, లంచము, హక్కుల ఉల్లంఘన, అనవసర పక్షపాతము నుండి దూరముండండి. దుష్ట సంగములో కూర్చొనకూడదు. ఏ జాతి, ఏ వర్గపు వ్యక్తికి నష్టము కలిగించుటకు సంకల్పించకుము. ప్రతి ఒక్కరి కొరకు నిజమైన ఉపదేశకునిగా మారుము. దుర్జనులు, దుస్వాభావికులు, అశాంతి, దుష్కర్మలకు పాల్పడు వారిని మీ సమావేశములలో రానివ్వకుము. వారు మీ గృహములలో కూడ వుండకూడదు. ఎందుకనగా వారి వలన మీకు నష్టము కలుగవచ్చును. ఈ ఉపదేశములను పాటించుట నా జమాఅత్‌లోని ప్రతి వ్యక్తి కర్తవ్యము. ప్రపంచమంతటికి పుణ్యము, సత్కార్యములో మిమ్ములను ఆదర్శములా నిలుపదలచెను. కనుక మీరు చైతన్యవంతులు కావలెను. నిజమైన పవిత్ర మనస్కులు, నిరాడంబరులు, వినయులు, విధేయులుగా మారండి. మీరు ఐదు పూటల నమాజ్, ప్రవర్తనల వలన గుర్తించబడుదురు. దుష్ట స్వభావికులు సన్మార్గముపై నిలువలేరు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం బైఅత్ హక్కు చెల్లించుటకు అల్లాహ్ తఆలా మనందరిని అనుగ్రహించుగాక! వారి ఉపదేశములు, ఆశయములను పూర్తి చేయువారమగుదుము గాక! ఈ జల్స ద్వారా అత్యధికంగా ప్రయోజనము పొందుతూ తమ ధార్మిక, ఆధ్యాత్మిక, విద్యాపరమైన స్థితిని చక్కదిద్దుకొను వారమగుదుము గాక! అనంతరం ఈ పుణ్యములు మనలో శాశ్వతంగా కొనసాగవలెను.

☆ ☆ ☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

| From, | To, |
|---|---|
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |